సాక్షి
కుమురం భీం

మంగళవారం । 25 । ఏప్రిల్ । 2023



గాలివానతో తీవ్ర నష్టం
చింతలమానెపల్లి, బెజ్జూర్ మండలాల్లో సోమవారం గాలివాన బీభత్సం సృష్టించింది. గాలుల తీవ్రతకు పలువురి ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. 9లో▸



సీసాలతో సిరులు..!
కౌటాల పంచాయతీ అధికారులు బీర్, మందు సీసాలను సేకరించి విక్రయిస్తున్నారు. ఇటీవల కొన్ని సీసాలను విక్రయించగా రూ.5వేల ఆదాయం వచ్చింది. 9లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
36.7 /24.8

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వాతావరణం చల్లబడుతుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. మధ్యాహ్నం తర్వాత అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు మెగా జాబ్ మేళా
ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాల(కోర్టు ఎదురుగా)లో జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ హేమంత్ బోర్కడే ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో 40కి పైగా ప్రైవేట్ కంపెనీలు 3,500 వరకు ఉద్యోగాలు భర్తీ చేస్తాయని పేర్కొన్నారు. 18 సంవత్సరాలు పైబడిన యువతీ, యువకులు అర్హులని తెలిపారు. అర్హులైన వారు ధ్రువపత్రాలతో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే మేళాలో పాల్గొనాలని సూచించారు.

డీఈఈ సెట్- 2023 దరఖాస్తుల స్వీకరణ
ఆసిఫాబాద్‌అర్బన్: డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ రెండు సంవత్సరాల కోర్సులో ప్రవేశాలకు నిర్వహించే డీఈఈ సెట్- 2023 కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైనట్లు డీఈవో అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హతలు కలిగిన విద్యార్థులు మే 22 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. http://deecet.cdse.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.


ఫారెస్ట్ నర్సరీ కార్మికుల కూలి పెంచాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని ఫారెస్ట్ నర్సరీల్లో పనిచేస్తున్న కార్మికులకు రోజువారీ కూలి రూ.600లకు పెంచాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ డిమాండ్ చేశారు. నర్సరీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కలెక్టర్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ హేమంత్ బోర్కడేకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ నర్సరీ కార్మికులకు రవాణా ఖర్చులు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్రతినెలా 5లోగా వేతనాలు చెల్లించాలన్నారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు, కార్మికులు దివాకర్, పిడుగు శంకర్, సుధాకర్, ఆనంద్, కౌసల్య, మాయ, సుజాత, యశోద, ప్రమీల, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.


నేడు ఆత్మీయ సమ్మేళనం



జిల్లా కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే సక్కు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని టాటియా గార్డెన్‌లో మంగళవారం ఉదయం 10 గంటలకు బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు సోమవారం జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు ఏర్పాట్లను పరిశీలించారు. ఆత్మీయ సమ్మేళనానికి నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని పిలుపునిచ్చారు. సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. వారి వెంట ఎంపీపీ అరిగెల మల్లికార్జున్, వాంకిడి జెడ్పీటీసీ అజయ్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ గాదెవేణి మల్లేశ్, సింగిల్‌విండో చైర్మన్ అలిబిన్ అహ్మద్, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ ఏఎంసీ చైర్మన్ వెంకన్న, పట్టణ అధ్యక్షుడు అహ్మద్ తదితరులు ఉన్నారు.

బాధితులకు న్యాయం చేస్తాం



దరఖాస్తు పరిశీలిస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్: ప్రజావాణికి వచ్చిన బాధితులకు చట్టపరంగా న్యాయం చేస్తామని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వివిధ మండలాలకు చెందిన ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. బాధితులకు న్యాయం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని భరోసా నిచ్చారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరించాలని పోలీసు అధికారులు, సిబ్బందిని ఆదేశించారు.

తీరని నష్టం..!

దహెగాం మండలం కర్జీ గ్రామానికి చెందిన ఎల్కరి శంకర్ గ్రామ శివారులోని రెండెకరాల్లో వరి పంట సాగు చేశాడు. మరో నాలుగు రోజుల్లో పంటను కోసేందుకు సిద్ధమవుతున్నాడు. ఈ తరుణంలో కురిసిన వడగండ్ల వానకు వరి గింజలన్నీ రాలిపోయాయి. జిల్లాలో చాలాచోట్ల రైతులది ఇదే పరిస్థితి..

- పంటలు చేతికందే దశలో అకాల వర్షాలు, వడగండ్లు
- నేలవాలుతున్న వరి
- జిల్లాలో 3,097 ఎకరాల్లో పంటలకు నష్టం
- ఆందోళనలో అన్నదాతలు

యాసంగి పంటల వివరాలు (ఎకరాల్లో)

వరి	17,782	పెసర	2,116
జొన్న	10,208	గోధుమ	1,219
శనగ	7,849	ఇతర	1,301
మొక్కజొన్న	2,315	మొత్తం	42,790



పెంచికల్‌పేట్ మండలం ఎల్కపల్లిలో నేలవాలిన వరిని చూపుతున్న మహిళా రైతు

కౌటాల(సిర్పూర్): జిల్లా వ్యాప్తంగా నాలుగు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వేలాది ఎకరాల్లో యాసంగి పంటలకు నష్టం వాటిల్లగా, చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. గాలిదుమారానికి ఇంటి పైకప్పులు ఎగిరిపోతుండటంతో ఆస్తి నష్టం జరుగుతోంది.

జిల్లా అతలాకుతలం..
జిల్లాలో గాలివానతోపాటు వడగళ్లు నాలుగు రోజులుగా నుంచి బీభత్సం సృష్టిస్తున్నాయి. అకాల వర్షాలు అన్నదాతలను అతలాకుతలం చేస్తున్నాయి. మంగళవారం సైతం సాయంత్రం పలుచోట్ల భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో బలంగా వీస్తున్న గాలులు వేలాది ఎకరాల్లో కోతకొచ్చిన వరి, మొక్కజొన్న పంటలను దెబ్బతీస్తున్నాయి. కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోతుంది. సిర్పూర్(టి)- కాగజ్‌నగర్ ప్రధాన రహదారితోపాటు కౌటాల- బెజ్జూర్ రహదారులపై భారీ వృక్షాలు కూలిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ స్తంభాలు విరిగి, వైర్లు తెగిపడటంతో చింతలమానెపల్లి, బెజ్జూర్, కౌటాల, దహెగాం, పెంచికల్‌పేట్, కాగజ్‌నగర్ గ్రామీణ ప్రాంతాల్లో రాత్రంతా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

3,097 ఎకరాల్లో నష్టం
ఈ ఏడాది యాసంగిలో మొత్తం 42,790 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. వాంకిడి, రెబ్బెన, కెరమెరి, దహెగాం, తిర్యాణి, కౌటాల, సిర్పూర్(టి), బెజ్జూర్, చింతలమానెపల్లి తదితర మండలాల్లో ఆరుతడి పంటలు అధికంగా సాగులో ఉన్నాయి. వరి 17,782 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. అకాల వర్షంతో జిల్లాలోని పలు మండలాల్లో రైతులు నష్టపోయారు. తిర్యాణి మండలంలో ఐదెకరాల్లో వరి, 32 ఎకరాల్లో పెసర, దహెగాం మండలంలో 358 ఎకరాల్లో వరి, పెంచికల్‌పేట్ మండలంలో 2,154 ఎకరాల్లో వరి, 24 ఎకరాల్లో మొక్కజొన్న, నాలుగెకరాల్లో నువ్వులు, కౌటాలలో 20 ఎకరాల్లో వరి, కాగజ్‌నగర్ మండలంలో 500 ఎకరాల్లో వరి పంటకు నష్టం జరిగినట్లు వ్యవసాయాధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. జిల్లావ్యాప్తంగా 3,097 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు గుర్తించారు.

వంద ఎకరాల్లో నష్టం
కౌటాల(సిర్పూర్): కౌటాల మండలంలో సోమవారం సాయంత్రం వడగండ్ల వానకు పార్డీ, సాండ్‌గాం, వీరవెల్లి గ్రామాల్లో వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. దాదాపు వందకు పైగా ఎకరాల్లో పంట నేలవాలింది.



కౌటాల మండలం సాండ్‌గాంలో నేలవాలిన వరి

పంట నేలవాలింది



నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షంతో వరి మొత్తం నేలవాలింది. నాలుగెకరాల్లో వరి సాగు చేశా. నాలుగు నెలలుగా ఎంతో కష్టపడుతున్నాం. మరి కొద్దిరోజుల్లో పంట కోతకు వస్తుండగా, ఇంతలో వడగండ్ల వానతో తీవ్ర నష్టం జరిగింది. ఏటా ఏదో విధంగా నష్టం జరుగుతుంది. ప్రభుత్వం పంటల సర్వే చేసి బాధితులను ఆదుకోవాలి.

– దాసరి కైలాసం, మొట్లగూడ, పెంచికల్‌పేట్

రైతులు ఆందోళన చెందొద్దు

జిల్లాలో కొద్దిరోజులుగా అకాల వర్షాలు కురుస్తున్నాయి. పలు మండలాల్లో యాసంగి పంటలకు నష్టం వాటిల్లింది. వడగండ్ల వానతో 3,097 ఎకరాల్లో పంటలకు నష్టం జరిగింది. వ్యవసాయాధికారులు పూర్తిస్థాయిలో పంట నష్టం సర్వే చేస్తారు. వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తాం. త్వరలోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తాం. బాధిత రైతులు ఆందోళన చెందవద్దు.

– ఆర్.శ్రీనివాస్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి

సమన్వయంతో అర్జీలు పరిష్కరించాలి



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

- కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్: అన్నిశాఖల అధికారులు సమన్వయంతో ప్రజల అర్జీలను పరిష్కరించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల విభాగంలో అదనపు కలెక్టర్ రాజేశంతో కలిసి అర్జీలు స్వీకరించారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆసిఫాబాద్ మండలం టిమరస్ మోవాడ్, బండగూడ, టోకిగూడ గ్రామాలకు చెందిన ప్రజలు విన్నవించారు. నివాస స్థలం ఉన్న తమకు డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని ఆసిఫాబాద్ మండలం ఎల్లారంకు చెందిన పాడుపుగంటి కేతన, అమృత, సిర్పూర్(టి) మండలం కేశవపట్నం, భూపాలపట్నం గ్రామాలకు చెందిన గోమాస గీత దరఖాస్తు చేసుకున్నారు. అటవీహక్కు పత్రం కలిగిన భూమిలో గిరి వికాస్ పథకం కింద బోర్‌వెల్ ఏర్పాటు చేయాలని పెంచికల్‌పేట్ మండలం జైహింద్‌పూర్‌కు చెందిన గిరిజన రైతులు కలెక్టర్‌ను కోరారు. వ్యవసాయ భూమిలోని బోర్‌వెల్‌కు విద్యుత్ కనెక్షన్ కోసం స్తంభం మంజూరు చేయాలని లింగాపూర్ మండలం కొత్తపల్లి పంచాయతీలోని నిమ్మనాయక్ తండాకు చెందిన రాథోడ్ బబితాబాయి దరఖాస్తు చేసుకుంది.

మూడు నెలల్లో జాతీయ రహదారి పనులు పూర్తి చేయాలి

ఆసిఫాబాద్: జిల్లాలో చేపడుతున్న జాతీయ రహదారి పనులు మూడు నెలల్లో పూర్తిచేయాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం అదనపు కలెక్టర్ రాజేశం, ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి జాతీయ రహదారులు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నిర్మాణ పనులతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పనులు తుదిదశకు చేరిన నేపథ్యంలో రహదారులకు అనుసంధానమైన ఫ్లైఓవర్ వంతెనల నిర్మాణ పనులు వర్షాకాలంలోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసిఫాబాద్ మండలంలోని రాజూర, వాంకిడి మండలంలోని దాబా గ్రామాల నుంచి మట్టి తరలించినందున, దెబ్బతిన్న రహదారి మరమ్మతులు త్వరగా పూర్తిచేయాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. గుండి వంతెన పనులు వర్షాకాలంలోగా పూర్తి చేయాలని, అప్పటి వరకు ప్రత్యామ్నాయంగా తాత్కాలిక రహదారి ఏర్పాటు చేయాలన్నారు. పనుల పురోగతిపై ప్రతిరోజూ నివేదిక సమర్పించాలన్నారు. వారం రోజుల్లో ఆసిఫాబాద్ బైపాస్ పనులు పూర్తి చేసి రవాణాకు సిద్ధం చేస్తామని ఫోర్‌లేన్ అధి కారులు తెలిపారు. పంచాయతీరాజ్ ఈఈ రామ్మోహన్ రావు, డీఈఈ కృష్ణ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై ఉక్కుపాదం

ఆసిఫాబాద్‌అర్బన్: నిషేధిత మత్తు పదార్థాలపై ఉక్కుపాదం మోపాలని డీజీపీ అంజనీకుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి సోమవారం ఎస్పీ సురేశ్‌కుమార్‌తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని శాంతిభద్రతలపై సమీక్షించారు. డీజీపీ మాట్లాడుతూ ప్రజలు మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కేసుల విషయంలో నాణ్యత పాటించాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఏఎస్పీలు అచ్చేశ్వర్‌రావు, భీంరావు, డీఎస్పీలు శ్రీనివాస్, కరుణాకర్, టాస్క్‌ఫోర్ సీఐ సుధాకర్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ సీఐ పవన్‌కుమార్, సీఐలు రాణాప్రతాప్, బుద్ధ స్వామి, శ్రీనివాస్, రామకృష్ణ, సాదిక్‌పాషా, ఎస్సైలు రమేశ్, మధుకర్, ప్రవీణ్, సాగర్, సిరాజ్, లావణ్య, డీపీవో భక్త ప్రహ్లాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఫంక్షనల్ వర్టికల్‌లో ప్రతిభ కనబర్చిన పోలీసు అధికారులకు ఎస్పీ రివార్డులు అందించారు. కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, కాగజ్‌నగర్ సీఐలు శ్రీనివాస్, స్వామిలను శాలువాతో సన్మానించి బహుమతులు అందజేశారు.



రివార్డులు అందిస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్

రంగయ్య కృషి వెలకట్టలేనిది



రంగయ్య కుటుంబాన్ని సన్మానిస్తున్న విద్యాశాఖ కమిషనర్ దేవసేన, కలెక్టర్ హేమంత్ బోర్కడే, తదితరులు

- సావర్‌ఖేడా క్రమశిక్షణ కలిగిన ఊరు..
- పిల్లలను తప్పకుండా బడికి పంపాలి
- రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ దేవసేన
- సావర్‌ఖేడా పాఠశాలలో ఘనంగా ఎఫ్‌ఎల్ఎన్ డే
- హాజరైన కలెక్టర్ హేమంత్ బోర్కడే, జిల్లా అధికారులు

కెరమెరి(ఆసిఫాబాద్): సావర్‌ఖేడా ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి రంగయ్య చేసిన కృషి, ఆయనపై ఇక్కడి ప్రజలు చూపిస్తున్న అభిమానం వెలకట్టలేనిదని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్, ప్రాజెక్ట్ డైరెక్టర్ దేవసేన అన్నారు. కెరమెరి మండలంలోని సావర్‌ఖేడా ప్రాథమిక పాఠశాలలో సోమవారం నిర్వహించిన ఎఫ్ఎల్ఎన్(ఫౌండేషనల్, లిటరసీ, న్యూమరసి) డే కార్యక్రమంలో కలెక్టర్ హేమంత్ బోర్కడే, అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, డీఈవో అశోక్, స్టేట్ ప్లానింగ్ కోఆర్డినేటర్ వినయ్‌తో కలిసి హాజరయ్యారు. విద్యాశాఖ కమిషనర్ మాట్లాడుతూ మారుమూల గ్రామంలో ఇలాంటి ప్రజలు, చక్కటి ఉపాధ్యాయ టీం ఉంటుందని ఊహించలేదన్నారు. ఇక నుంచి రంగయ్యను సార్ అని గౌరవంగా సంబోధిస్తానని స్పష్టం చేశారు. మద్యం వాసన లేకుండా క్రమశిక్షణ గల గ్రామం ఇదేనని అన్నారు. సూపర్ 100 విద్యార్థులే కాకుండా సూపర్ 500, 1000 విద్యార్థులు తయారు కావాలని ఆకాంక్షించారు. పిల్లలను క్రమం తప్పకుండా బడికి పంపాలని సూచించారు. రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా రంగయ్య గురించి చెప్తానని తెలిపారు. ఏడో తరగతి ఉన్నతీకరణ, అదనపు తరగతి గదుల కోసం నివేదికలు పంపించాలని డీఈవోకు సూచించానన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మరాఠీలో మాట్లాడి ఆకట్టుకున్నారు. అనంతరం రంగయ్య కుటుంబాన్ని శాలువాతో సత్కరించారు. హైదరాబాద్‌కు చెందిన కాంట్రాక్టర్ ఇచ్చిన విరాళాన్ని చదువులో ప్రతిభ చూపిన ముగ్గురు విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ పెందోర్ మోతిరాం, వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం, ఎస్‌వోలు భరత్, సుభాష్, సత్యనారాయణ మూర్తి, సత్తయ్య, స్వర్ణలత, ఎంపీడీవో సత్యనారాయణ, ఎంఈవోలు సుధాకర్, మనుకుమార్, ఎంఎస్‌వో ఆడే ప్రకాశ్, ఎస్ఎంసీ చైర్మన్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్థలం జోలికొస్తే చంపేస్తాం..!

- ఆదివాసీ మహిళకు బెదిరింపులు
- పొలంలోకి రానివ్వని స్థానిక నేతలు
- కోర్టు ఆదేశాలను బేఖాతర్ చేస్తున్న వైనం
- న్యాయం చేయాలంటూ కలెక్టర్, ఎస్పీని ఆశ్రయించిన బాధితురాలు



కబ్జాదారులు ఆక్రమించుకుని దున్నిన పొలం

సాక్షి, ఆసిఫాబాద్: 'స్థలం జోలికొస్తే.. చంపేసి తుమ్మచెట్లలో పడేసి గ్యాస్ నూనె పోసి అగ్గిపెడతాం' అంటూ మూడేళ్లుగా ఓ ఆదివాసీ మహిళను ఆమె బంధువులు, స్థానిక బీఆర్ఎస్ నేతలు కలిసి బెదిరిస్తున్న వైనమిది. పొలం దక్కించుకోవడం కోసం మూడేళ్లుగా ఆమె ఒంటరి పోరాటం చేస్తోంది. కోర్టు స్పష్టమైన ఆదేశాలిచ్చినా వాటిని సైతం లెక్క చేయకపోవడంతో చివరకు బాధితురాలు 'అక్రమార్కుల చెర నుంచి నా పొలాన్ని విడిపించండి' అంటూ సోమవారం కలెక్టర్, ఎస్పీని కలిసి వేడుకుంది. వివరాల్లోకి వెళ్తే.. రెబ్బెన మండలం రోళ్లపాడు గ్రామానికి చెందిన బత్తిన లక్ష్మికి సర్వే నంబరు 17/15/1లో 4.10 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. లక్ష్మి పొలానికి వెనుక భాగాన ఆమె సోదరికి చెందిన పొలం ఉండేది. ఆమె ఆ పొలాన్ని ఇతరులకు విక్రయించింది. కొన్నేళ్ల కిందట నాలుగు వరసల రహదారి విస్తరణలో బత్తిన లక్ష్మికి చెందిన కొంత భాగం పోయింది. అందుకుగాను నష్టపరిహారం ఆమెకు అందింది. ఇంతవరకూ బాగానే ఉండగా.. బాధితురాలి పొలం నాలుగు వరుసల రహదారికి అనుకునే ఉండడం.. స్థలం ధర కూడా అమాంతంగా పెరగడంతో స్థానిక అధికార పార్టీ నేతలు ఆమె సోదరి, మరిదితో కలిసి ఆ పొలాన్ని ఆక్రమించే యత్నం చేశారు. అందులో భాగంగా 'మీ సోదరి మాకు పొలం అమ్మింది. ఆ స్థలం ఇదే' అని బత్తిన లక్ష్మిపై తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చి ఆమెను పొలంలోకి రాకుండా అడ్డుకుంటున్నారు.



బాధితురాలు బత్తిన లక్ష్మి

మూడేళ్లుగా పోరాటం చేస్తున్నా.. న్యాయం చేయండి

'రెవెన్యూ రికార్డుల్లో నా పేరిట సర్వే నంబరు 17/15/1లో 4.10 ఎకరాలు ఉన్నట్లు స్పష్టంగా ఉంది. పాసు బుక్కు నా పేరిటనే ఉంది. అలాగే నాకు ప్రతి ఏటా రైతుబంధు స్కీం కింద రూ. 25వేలు వస్తోంది. రహదారి విస్తరణలో భాగంగా నష్టపోయిన స్థలానికి పరిహారం అందింది. అయితే నాది, నా సోదరి పేరిట ఉన్న భూమికి ఒకే సర్వే నంబరు ఉండడంతో అక్రమార్కులకు వరంగా మారింది. నా సోదరి తక్కువ ధరకు తన భూమిని అమ్ముకుంది. ఇప్పుడు నా భూమి ఎకరం రూ.80 లక్షల వరకు పలుకుతోంది. దీంతో ఆ భూమిని కాజేసేందుకు నా సోదరి బద్ది ముత్తక్క, ఆమె భర్త చిన్నయ్యతోపాటు బీఆర్ఎస్ నేతలు పులికుంట సర్పంచ్ బుర్స పోచమల్లు, ఎంపీటీసీ సంఘం శ్రీనివాస్, నంబాల గ్రామానికి చెందిన కొవ్వూరి శ్రీనివాస్, చింతపూడి శంకర్ తదితరులు ప్రయత్నం చేస్తున్నారు. నేను ఎన్నోసార్లు తహసీల్దార్ కార్యాలయంలో భూ కొలతలు చేపట్టి నా భూమి సరిహద్దులు చూపెట్టాలని దరఖాస్తు చేశా. నా భూమిని మండల సర్వేయర్ కొలవకుండా బీఆర్ఎస్ పార్టీ నేతలు అడ్డుకుంటున్నారు. చివరకు జిల్లా కోర్టును ఆశ్రయించగా న్యాయస్థానం నాకు అనుగుణంగా ఇంజెక్షన్ ఆర్డర్ ఇచ్చింది. దానిని సైతం ఆక్రమణదారులు లెక్కచేయడం లేదు. పొలం జోలికి వస్తే చంపేస్తామని బెదిరిస్తున్నారు. అక్రమార్కుల చెర నుంచి నా భూమిని విడిపించి నాకు న్యాయం చేయండి' అని బత్తిన లక్ష్మి సోమవారం కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎస్పీ సురేశ్ కుమార్‌లను కలిసి వినతిపత్రం అందించింది. ఆమె విన్నపాన్ని పరిశీలించిన జిల్లా ఉన్నతాధికారులు ఇద్దరూ సానుకూలంగా స్పందించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు బాధితురాలు 'సాక్షి'కి తెలిపింది. 'పొలంలోకి వెళ్లకుండా నన్ను అడ్డుకుంటున్నారు. పొలం కబ్జా చేసి సాగు చేసుకుంటున్నారు. మూడు లక్షలు ఇస్తాం.. పొలం వదిలేసి వెళ్లు అని బెదిరిస్తున్నారు. మూడేళ్లుగా ఒంటరి పోరాటం చేస్తున్నా..' అని బత్తిన లక్ష్మి వాపోయింది.



క్లుప్తంగా

విద్యుత్ తీగ తెగిపడి వృద్ధురాలు మృతి


రాజవ్వ మృతదేహం

దండేపల్లి(మంచిర్యాల): విద్యుత్ తీగ తెగిపడి వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని తాళ్లపేటకు చెందిన గోపతి రాజవ్వ (72) సోమవారం ఉదయం తన ఇంటిముందున్న మరో ఇంటికి వెళ్లి వస్తుండగా స్తంభానికి ఉన్న తీగ ప్రమాదవశాత్తు తెగి వృద్ధురాలిపై పడింది. విద్యుత్‌షాక్‌కు గురికావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మృతురాలి కుమారుడు శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వెల్లడించారు.

బెల్లంపల్లిలో ఇద్దరికి కరోనా

బెల్లంపల్లి: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో కోవిడ్ అనుమానిత లక్షణాలున్న 14 మంది సోమవారం కరోనా పరీక్షలు చేయించుకోగా ఇద్దరికి పాజిటివ్ నిర్ధారణ అయినట్లు వైద్యసిబ్బంది పేర్కొన్నారు. పట్టణానికి చెందిన ఇద్దరు కోవిడ్ బారిన పడడంతో వారిని హోం క్వారంటైన్‌లో ఉండాలని ఇంటికి పంపించారు. నిబంధనలు పాటించాలని వైద్యులు సూచించారు.

రూ.21.30లక్షల నకిలీ నోట్లు పట్టివేత


నిందితుడు హిప్రె తిరుపతి

వాంకిడి(ఆసిఫాబాద్): కుమురంభీం జిల్లా వాంకిడి మండల కేంద్రంలో తరలించడానికి సిద్ధంగా ఉన్న రూ.21.30లక్షలు విలువైన కరెన్సీ నోట్లను ఆదివారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై డి.సాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రం వాంకిడికి చెందిన హిప్రె తిరుపతి నకిలీ నోట్ల ముఠాతో చేతులు కలిపి కరెన్సీ నోట్ల దందా చేస్తున్నాడు. పక్కా సమాచారం మేరకు అతడి ఇంట్లో ఆదివారం రాత్రి తనిఖీలు నిర్వహించగా భారీగా నకిలీ కరెన్సీ నోట్లు పట్టుబడ్డాయి. రూ.21.30లక్షలు విలువైన రూ.500 నోట్లను స్వాధీనం చేసుకున్నారు. మండల పరిధిలోని అమాయక ఆదివాసీ ప్రజలను లక్ష్యంగా చేసుకుని ఈ అక్రమ దందాకు పాల్పడుతున్నట్లు వెల్లడించారు. నకిలీ నోట్లకు తేడా లేకుండా ఉన్నందున రూ.లక్ష ఒరిజినల్ నోట్లకు రూ.3 లక్షలు చొప్పున వ్యాపారం సాగిస్తున్నారని, పట్టుబడిన నకిలీ నోట్లను సీజ్ చేసి వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

గొర్రెల పెంపకం దారులకు అవగాహన

జన్నారం(ఖానాపూర్): రెండో విడత గొర్రెల పంపిణీపై సోమవారం మండల కేంద్రంలో 13 గ్రామ పంచాయతీలకు సంబంధించిన సొసైటీలు, యాదవులు, గొర్రెల కాపరులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రమేశ్‌కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ శంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు గొర్రెల పెంపకంలో మెలకువలు, రోగాలు రాకుండా తీసుకునే జాగ్రత్తలు, డీడీలు కట్టడం, గొర్రెల ఎంపిక, ట్రాన్స్‌పోర్టు, సొసైటీ ఎన్నికల నిర్వహణ, పశువుల మేత, పశుపోషణ, పెంపకం, వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి శ్రీకాంత్, తపాలాపూర్, ఇందన్‌పల్లి గ్రామాల పశువైద్యాధికారులు కిరణ్‌కుమార్, రాజుకుమార్, యాదవ సంఘం మండల అధ్యక్షుడు బొంతల మల్లేశ్, ఉపాధ్యక్షుడు నర్సయ్య, కార్యదర్శి రాజన్న తదితరులు పాల్గొన్నారు.

ఆటలు ఆడేదెలా?

- ఆర్‌కేపీ ఠాగూర్ స్టేడియంలో సమస్యల తిష్ట
- నిత్యం గ్రౌండ్‌లోనే సంచరిస్తున్న పశువులు
- ఆనవాళ్లు కోల్పోయిన వాకింగ్ ట్రాక్, క్రికెట్ పిచ్
- పట్టించుకోని సింగరేణి అధికారులు



ఠాగూర్ స్టేడియం ముఖద్వారం

రామకృష్ణాపూర్(చెన్నూర్): సింగరేణి చరిత్రలోనే ఓ ప్రత్యేక గుర్తింపు సాధించుకున్న రామకృష్ణాపూర్‌లోని ఠాగూర్ స్టేడియంలో సమస్యలు తిష్ట వేశాయి. ఎంతో చరిత్ర కలిగిన ఈ స్టేడియం నేడు కళావిహీనంగా మారింది. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను అందించిన చరిత్ర ఈ స్టేడియానికి ఉంది. సింగరేణి వ్యాప్తంగా ప్రత్యేకతను సంతరించుకున్న స్టేడియం ప్రస్తుతం నిర్వహణలో గాడి తప్పింది. క్రీడాకారులు, ఔత్సాహికులతో కిటకిటలాడాల్సిన స్టేడియం నిత్యం పశువులతో దర్శనమిస్తోంది. భయభ్రాంతులకు గురిచేసేలా తయారైందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనికంతటికీ నిర్వహణలో లోపాలు, వైఫల్యాలే ప్రధాన కారణమని క్రీడాకారులు, పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు.

లక్షలాది రూపాయలు మట్టిపాలు

సువిశాలమైన మైదానంతో సింగరేణి వ్యాప్తంగా ప్రఖ్యాతి గాంచిన స్టేడియంలో కొన్నాళ్ల క్రితమే లక్షలాది రూపాయలు వెచ్చించి వాకింగ్ ట్రాక్ నిర్మించారు. ఇటీవల జరిగిన కోలిండియా క్రికెట్ పోటీల్లో భాగంగా సుమారు రూ.50 లక్షలు వెచ్చించి హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియం తరహాలో అంతర్జాతీయ నిపుణులతో టర్ఫ్ క్రికెట్ పిచ్ ఏర్పాటు చేశారు. అయితే అటు వాకింగ్ ట్రాక్‌తో పాటు క్రికెట్ పిచ్ ప్రస్తుతం నామరూపాల్లేకుండా పోయాయి. దీంతో లక్షలాది రూపాయలు మట్టిపాలయ్యాయని పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు.

నిత్యం స్టేడియంలోనే పశువులు

'ఎవరు పడితే వారు వచ్చి ఆడడానికి ఇది మీ క్రీడా ప్రాంగణం కాదు.. ఇది మా అడ్డా. మా బందెల దొడ్డి' అన్నట్లు ఉంది ఠాగూర్ స్టేడియంలోని పరిస్థితి. నిత్యం స్టేడియంలో పశువులు సంచరిస్తుండడంతో వ్యాయామం..వాకింగ్ చేసేందుకు వచ్చేవారు, క్రీడాకారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అప్పుడప్పుడు మనుషులపైకి ఎగబడుతుండటంతో చాలామంది బిక్కుబిక్కుమంటూ వాకింగ్ చేస్తున్నారు. చిన్నపిల్లలతో వచ్చే కొందరు పశువుల భయానికి స్టేడియానికి రావడమే మానేశారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అంతేకాకుండా స్టేడియంలో కుక్కలు, పాముల బెడద కూడా తీవ్రంగానే ఉంది.

కనీస సౌకర్యాలు కరువు

విశాలమైన స్టేడియంగా గుర్తింపు ఉన్నప్పటికీ కనీస సౌకర్యాలు కరువయ్యాయి. స్టేడియంలో వాకింగ్ కోసం వచ్చే ప్రజలకు కనీసం తాగునీటి సౌకర్యం కూడా లేదు. ఇక మరుగుదొడ్లు అసలే లేవు. వాకింగ్, జాగింగ్ చేసి అలిసిపోయే వారి కోసం కూర్చునేందుకు వీలుగా బల్లలు కూడా ఏర్పాటు చేయలేదు. ఇంత పెద్ద స్టేడియానికి కనీసం ఒక వాచ్‌మెన్‌ను కూడా నియమించలేదంటే సింగరేణి అధికారుల నిర్లక్ష్యం ఇట్టే అర్థమవుతోంది. క్రీడాకారులకు పుట్టినిల్లుగా పేరున్న రామకృష్ణాపూర్‌పై సింగరేణి అధికారులు వివక్షను మాని స్టేడియంలో కనీస సౌకర్యాల కల్పనకు కృషి చేయాలని క్రీడాకారులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.

పట్టించుకుంటలేరు



ఠాగూర్ స్టేడియంను సింగరేణి అధికారులు పూర్తిగా పట్టించుకుంటలేరు. గతంలో క్రీడాకారులతో స్టేడియం కళకళలాడేది. ఇందులో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ స్థాయి క్రికెట్ పిచ్ పూర్తిగా కనుమరుగైంది. క్రీడాకారులకు కనీస వసతులు లేవు. ఇప్పటికైనా అధికారులు స్టేడియం నిర్వహణపై దృష్టి సారించాలి.
– నూనె శ్రీనివాస్, సీనియర్ క్రికెట్ ప్లేయర్

తాగునీరు కూడా లేదు



ఇంత పెద్ద స్టేడియంలో కనీసం తాగునీటి సౌకర్యం లేదు. వాకింగ్ కోసం అధిక సంఖ్యలో జనం వస్తున్నారు. స్టేడియంలో తిష్ట వేస్తున్న పశువుల కారణంగా భయాందోళనకు గురవుతున్నారు. టాయిలెట్స్ కూడా లేకపోవడంతో ముఖ్యంగా మహిళలు ఇబ్బంది పడుతున్నారు. వాలీబాల్, బాస్కెట్‌బాల్ కోర్టులు అధ్వానంగా తయారయ్యాయి.
– బెల్లం శ్రీనివాస్, ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయుడు

చెన్నూర్‌లో మహారాష్ట్ర తాటిముంజలు


తాటిముంజలు విక్రయిస్తున్న మహారాష్ట్ర మహిళలు

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలో మహారాష్ట్ర తాటిముంజలకు మంచి డిమాండ్ ఉంటోంది. మహారాష్ట్రలోని సిరొంచ తాలుకా నుంచి గిరిజన మహిళలు తాటిముంజలు తీసుకువచ్చి ఇక్కడ విక్రయిస్తున్నారు. రూ.10కి ఐదు చొప్పున ఇస్తున్నారు. మూడేళ్లుగా ఇక్కడ తాటిముంజలు విక్రయిస్తున్నామని, ఈ ఏడాది వ్యాపారం బాగుందని మహారాష్ట్రకు చెందిన లక్ష్మి, గంగుబాయి తెలిపారు.

జైపూర్ గురుకులంలో సమ్మర్ స్పార్కిల్స్

జైపూర్(చెన్నూర్): మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులంలో సోమవారం సమ్మర్ స్పార్కిల్స్ కార్యక్రమం ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ బాలభాస్కర్ తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని పెంపొందించడానికి, వారిలో స్కిల్స్ డెవలప్ చేయాలన్న ఉద్దేశంతో కార్యక్రమం చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. డ్యాన్స్, సింగింగ్, డిటార్, ఆటలు, ఫన్‌గేమ్స్‌లలో 15 రోజుల పాటు హైదరాబాద్‌లోని శిక్షణ బృందంచే విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.

సీహెచ్‌పీ కార్మికులకు సేఫ్టీ జాకెట్స్ ఇవ్వాలి


కార్మికుల సమస్యలు తెలుకుంటున్న అన్నయ్య

నస్పూర్(మంచిర్యాల): శ్రీరాంపూర్ ఏరియాలోని సీహెచ్‌పీలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు సేఫ్టీ (రేడియం)జాకెట్స్ వెంటనే పంపిణీ చేయాలని టీబీజీకేఎస్ కేంద్ర ఉపాధ్యక్షుడు ధీకొండ అన్నయ్య డిమాండ్ చేశారు. సోమవారం సీహెచ్‌పీపై అలాయ్ బలాయ్ కార్యక్రమం నిర్వహించారు. కార్మికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలం దృష్ట్యా సీహెచ్‌పీ వద్ద డస్ట్ నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బైక్, కార్ పార్కింగ్ షెడ్ వెడల్పు చేయాలని ఆయన సూచించారు. కార్మికులకు ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ డెప్యూటీ జనరల్ సెక్రటరీ చాట్ల అశోక్, జీఎం కమిటీ సభ్యుడు కాశీరావు, బ్రాంచి కార్యదర్శి కానుగంటి చంద్రయ్య, సీహెచ్‌పీ పిట్ సెక్రటరీ కే.శ్రీనివాసాచారి, నాయకులు ఓరమ్ జగన్, అరకాల శ్రీనివాస్, మోతె రాజలింగు, అశోక్ రెడ్డి, సత్తయ్య, రవి, నారాయణ, గణేశ్, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి ఏరియా లేకుండా చేసేందుకు యత్నం

- హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్


మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

రెబ్బెన(ఆసిఫాబాద్): గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల చేతకాని తనం మూలంగా సింగరేణి యాజమాన్యం బెల్లంపల్లి ఏరియానే లేకుండా చేసేందుకు ప్రయత్నిస్తోందని హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ అన్నారు. సోమవారం కైరిగూడ ఓసీపీలో ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌కు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏరియాలో ఉన్న గుర్తింపు సంఘం టీబీజీకేఎస్, ప్రాతినిధ్య సంఘమైన ఏఐటీయూసీ కార్మికులను మోసం చేస్తూ ప్రైవేటీకరణకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. సింగరేణి కార్మికులు తీయాల్సిన బొగ్గును ప్రైవేటు ఓబీ కాంట్రాక్టర్ తీసేలా డైరెక్టర్ల నుంచి అనుమతులు వచ్చే వరకు ఆయా సంఘాలు సహకరించాయన్నారు. ప్రతిపక్ష యూనియన్‌గా గుర్తింపు సంఘం వైఫల్యాలను ఎండగట్టాల్సిన ఏఐటీయూసీ తమ సిద్ధాంతాలను మర్చిపోయి టీబీజీకేఎస్‌కు మద్దతు పలుకుతోందన్నారు. టీబీజీకేఎస్ నాయకులకు కమీషన్ల మీద ఉన్న శ్రద్ధ కార్మికుల మీద లేదన్నారు. గోలేటి-1, 1ఏ భూగర్భ గనులతో పాటు, ఎక్స్‌ప్లోరేషన్ డిపార్టుమెంట్లు వారి చేతకాని తనం మూలంగానే మూసివేశారన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ఓజియార్, నాయకులు శంకరయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు, జిల్లా అధ్యక్షుడు గౌస్, ఏరియా కార్యదర్శి ఇనూస్, పిట్ కార్యదర్శులు రమేశ్, శ్రీనివాస్, వినయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ త్వరగా పూర్తి చేయించాలి


కలెక్టర్‌తో సింగరేణి డైరెక్టర్ బలరాం

నస్పూర్(మంచిర్యాల): మందమర్రి, బెల్లంపల్లి, శ్రీరాంపూర్ ఏరియాల్లో ఓపెన్‌కాస్టు ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయించాలని సింగరేణి డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ పా ఎస్.బలరాం కలెక్టర్ బదావత్ సంతోష్‌ను కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి పలు సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎస్టేట్స్ జనరల్ మేనేజర్ రవి ప్రసాద్, శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాల జనరల్ మేనేజర్లు బి.సంజీవరెడ్డి, మోహన్‌రెడ్డి, దేవేందర్, పలువురు ఎస్టేట్స్, సర్వే అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'ఓపెన్' పరీక్షలు

మంచిర్యాలఅర్బన్: ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్ పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభంకానున్నాయి. పదో తరగతి విద్యార్థులు 686 మంది, ఇంటర్ విద్యార్థులు 1,253 మంది పరీక్షలు రాయనున్నారు. ఇందుకు జిల్లాలో పది కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు పరీక్షలు జరుగనున్నాయి. మే 12 నుంచి 19 వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు పరిశీలన


మరుగుదొడ్డి పరిశీలిస్తున్న అధికారి

దండేపల్లి(మంచిర్యాల): యూడైస్ ప్లాన్‌లో భాగంగా సోమవారం మండలంలోని సర్సాపూర్, మాకులపేట ప్రాథమిక పాఠశాలలను జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి సప్దర్‌అలీ సందర్శించారు. పాఠశాలల్లో మౌలిక వసతులు పరిశీలించారు. మరుగుదొడ్లు, మూత్రశాలలు పనిచేస్తున్నాయా, వాటికి రన్నింగ్ వాటర్ సౌకర్యం ఉందా? లేదా? అని పాఠశాలల ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంఐఎస్ నగేష్, సీఆర్పీ నర్సయ్య ఉన్నారు.

మట్టి పరీక్షలేవి..?

- జాడలేని భూసార పరీక్షలు
- రైతు వేదికల్లో నిరుపయోగంగా పరికరాలు
- రైతులకు భూసారం తెలిసేదెలా..?


రైతులతో కలిసి మట్టి నమూనాలను సేకరిస్తున్న ఏఈవో(ఫైల్)


ఆస్నాదలోని రైతు వేదికలో నిరుపయోగంగా భూసార పరీక్షల కిట్

చెన్నూర్‌రూరల్: పంటల సాగులో మంచి దిగుబడులు రావాలంటే మంచి విత్తనాలు వాడటం, సకాలంలో సస్యరక్షణ చర్యలు ఎంత ముఖ్యమో అంతకంటే ముందుగా భూసార పరీక్షలు చేయడం అంతే ముఖ్యం. ఏటా వానాకాలం, యాసంగి కోతల అనంతరం సాగు పనులు ప్రారంభించక ముందే రైతుల పంట పొలాల్లో మట్టి నమూనాలను సేకరించి భూసార పరీక్షలు నిర్వహించే వారు. భూసార పరీక్షల అనంతరం నివేదికలను బట్టి రైతులు ఏ పంటలు సాగు చేయాలి. ఎరువులు ఎలా వాడటం తెలుస్తుంది. దీంతో ఎరువులకు అదనపు ఖర్చు తగ్గి రైతులకు ఆదాయం పెంచుకునే అవకాశం ఉంటుంది. నేలలో సారాన్ని తెలుసుకోవడం రైతులకు ఎప్పటికప్పుడు అవసరం. అంతే కాకుండా భూసార పరీక్షల ఫలితాలను బట్టి వ్యవసాయాధికారులు సైతం రైతులకు పంటల సాగులో సలహాలు, సూచనలు అందజేయడం ఎంతో సులువు అవుతుంది. కానీ గత నాలుగేళ్లుగా భూసార పరీక్షలు నిర్వహించడం లేదు.

55 క్లస్టర్లలో పరికరాలు..

గతంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో కూడా భూసార పరీక్ష కేంద్రం ఉండేది. గతంలో రైతు వేదికలలో భూసార పరీక్ష కేంద్రాలు లేనప్పుడు ఆదిలాబాద్‌కు మట్టి నమూనాలను పంపించేవారు. మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా 55 క్లస్టర్లు ఉన్నాయి. ఈ క్లస్టర్లలో నాలుగేళ్ల క్రితం మినీ భూసార పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. రైతు వేదికలో ఏర్పాటు చేసిన భూసార పరీక్ష కేంద్రం ద్వారా సుమారు 50భూసార పరీక్షలు చేయవచ్చు. దీంతో నేలల సారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకునే సౌకర్యం కలిగిందని రైతులు ఆశించారు. ఏళ్లు గడుస్తున్నా అవి పూర్తి స్థాయిలో వినియోగంలోకి రాలేదు. ఆయా కేంద్రాలలో పరీక్ష కిట్లు ఉన్నప్పటికీ పరీక్షలు నిర్వహించేందుకు కెమికల్స్‌ను పంపిణీ చేయక పోవడంతో పరీక్షలు నిర్వహించ లేకపోతున్నారు. దీంతో భూసార పరీక్షలకు బ్రేక్ పడింది. సంబంధిత ఉన్నతాధికారులు పట్టించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం..



రైతులు నేరుగా ఆదిలాబాద్‌లోని భూసార పరీక్ష కేంద్రానికి వెళ్లి మట్టి పరీక్షలు చేయించుకోవచ్చు. రైతు వేదికలలో మట్టి పరీక్షల కిట్లను పంపిణీ చేయడం జరిగింది. కానీ కెమికల్స్ లేక పరీక్షలు చేయడం లేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.
–జాడి బాపు, ఏడీఏ, చెన్నూర్

కరెన్సీ సేకరణ అభినందనీయం


ఆరుష్‌ను అభినందిస్తున్న భాస్కర్‌రెడ్డి

మంచిర్యాలటౌన్: వివిధ దేశాలకు చెందిన కరెన్సీ, కాయిన్స్ సేకరించడం అభినందనీయమని రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి, వైస్ చైర్మన్ చందూరి మహేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సెవెన్ హిల్స్ హైస్కూల్‌లో ఆరోతరగతి చదువుతున్న విద్యార్థి గోనె ఆరుష్‌రావు సేకరించిన వివిధ దేశాలకు చెందిన 600ల కాయిన్స్, 47 దేశాలకు చెందిన కరెన్సీతో సోమవారం పాఠశాలలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. రజాకారుల కాలం నుంచి సేకరించిన కాయిన్స్, వివిధ బ్యాంకుల నోట్స్ సేకరించినందుకు విద్యార్థిని అభినందించారు.

మలేరియాపై అవగాహన కల్పించాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో

మంచిర్యాలటౌన్: ప్రజలకు మలేరియా నివారణపై అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో సుబ్బరాయుడు అన్నారు. ఈ నెల 25న ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో ఇందుకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవగాహన పోస్టర్లను అంటించాలని, ప్రజలకు మలేరియాపై అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ అనిత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీలు సత్వరం పరిష్కరించాలి

- ఐటీడీఏ ఏపీవో కనక భీంరావు


అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

ఉట్నూర్‌రూరల్: గిరిజన అర్జీలు సత్వరం పరిష్కరించాలని ఐటీడీఏ ఏపీఓ కనక భీంరావు, డీడీ దిలీప్‌కుమార్ పేర్కొన్నారు. ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనుల అర్జీలను శాఖల అధికారులు పరిశీలించి న్యాయం చేస్తారన్నారు. ఓఎస్డీ కిష్టయ్య, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, ఏవో రాంబాబు, జేడీఎం నాగభూషణ్, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్, డీపీవో ప్రవీణ్, ఐటీడీఏ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

- ఆర్ఓఎఫ్ఆర్ పట్టా ఇప్పించాలని బేల మండలం సైద్‌పూర్‌కు చెందిన పెందూర్ గంగుబాయి కోరాడు.
- కమ్యూనిటీ హాల్ మంజూరు చేయాలని ఉట్నూర్ మండలం జెండగూడ గ్రామానికి చెందిన ఆత్రం భగవంత్‌రావు అర్జీ అందించాడు. అదేవిధంగా గిరి వికాసం పథకం కింద త్రీఫేజ్ విద్యుత్ లైన్ మంజూరు చేయాలని గ్రామస్తులు కోరారు.
- కోళ్లఫారం మంజూరు చేయాలని ఉట్నూర్ మండలం తేజనాయక్ తండాకు చెందిన రాథోడ్ రామారావు విన్నవించాడు.

చేనేని భీమయ్యకు నివాళి


నివాళులర్పిస్తున్న ఆదివాసీలు

కాసిపేట(బెల్లంపల్లి): మండలంలోని మద్దిమాడలో ఆదివాసీ అమరుడు చేనేని భీమయ్య 35వ వర్ధంతిని సోమవారం ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివాసీ సంప్రదాయం ప్రకారం తెప్పటగుళ్లతో ఊరేగింపుగా విగ్రహం వద్దకు వెళ్లి పూజలు నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 35 ఏళ్ల క్రితం పెంకుటిళ్లు నిర్మించుకునేందుకు కర్ర తీసుకువస్తున్న ఆదివాసీలపై పోలీసులు జరిపిన కాల్పుల్లో ఎదురొడ్డి ప్రాణాలు వదిలిన భీమయ్య త్యాగం మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రొడ్డ లక్ష్మి, జెడ్పీటీసీ చెంద్రయ్య, సర్పంచ్ ఆడ జంగు, ఆదివాసీ నాయక్‌పోడ్ సేవా సంఘం రాష్ట్ర కోశాధికారి కొమ్ముల బాపు, మండలాధ్యక్షుడు బద్ది శ్రీనివాస్, తుడుందెబ్బ రాష్ట్ర నాయకులు సోయం జంగు, జిల్లా అధ్యక్షుడు మడావి వెంకటేశ్, ఉపాధ్యక్షుడు కనకరాజు, నాయకులు భీమిని మహేందర్, రెడ్డి లక్ష్మణ్, మంగ శ్రీకాంత్, సోమని పోశక్క, రెడ్డి భారతి, నాయిడి మల్లేశ్, సంద్ర భూమయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రగతి పత్రాలు


ప్రగతి పత్రాలతో విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: జిల్లాలోని పాఠశాలలకు ఈ నెల 25 నుంచి సెలవులు ప్రకటించడంతో సోమవారం చివరిరోజు ఉపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో పేరెంట్స్ కమిటీ నిర్వహించారు. విద్యార్థులకు ఆన్‌లైన్ ప్రగతి నివేదికలను అందజేశారు. సెలవుల్లో పిల్లలపై జాగ్రత్తలు వహించాలని తల్లిదండ్రులకు సూచించారు. పాత మంచిర్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య పాల్గొన్నారు.